క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ నారేవారిపల్లె సమీపంలోని అడ్డకొండలో కోడిపందెం ఆడుతున్న ఐదుగురు జూదరులను శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం పూలగూరకోటకు చెందిన పి.నరసింహులు, అనేపల్లికి చెందిన ఎబి.లోకేష్,ఆవులపల్లెకి చెందిన తలారి గోపాల్, ముతకపల్లికి చెందిన కెఎం.నాగరాజ, పుంగనూరు మండలం దిగువపల్లెకి చెందిన ఎస్.రెడ్డిప్రకాష్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే వారి నుంచి రూ.4830 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

పెద్దతిప్పసముద్రం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లతో కలసి మురుగు కాలువలు, నీటి నిల్వ పరిసరాలను పరిశీలించారు. ఇళ్ళలోని నీటి డ్రమ్ములు, నీటి తొట్టెలను శుభ్రపరచుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులు, దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మదనపల్లె తాలూకా సీఐగా వెంకటేశ్వర్లు



మదనపల్లె : మదనపల్లె తాలూకా సీఐగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సత్యనారాయణ వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వైఎస్సార్ కడపజిల్లా బద్వేల్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు మదనపల్లె తాలూకా సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు.

బీమా పాలసీలపై అవగాహన

తంబళ్లపల్లె : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ ఖాతాదారులకు బీమా పాలసీపై అవగాహన ముఖ్యమని ఆర్‌బీఓ జయరామరాజు తెలిపారు. శుక్రవారం ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయంలో బీమా పాలసీలపై అవగాహన సదస్సు జరిగింది. ఖాతాదారులకు ప్రభుత్వం ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమా యోజన పాలసీలో 18 ఏళ్ల నుండి 50 ఏళ్ల వయసును ఉన్న ఖాతాదారులు రూ.436 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ పాలసీదారులు రూ.2 లక్షల బీమా పొందవచ్చున్నారు. సురక్ష బీమాయోజన పాలసీ 18–70 ఏళ్ల గల ఖాతాదారులు తీసుకోవచ్చున్నారు. ఇందులో కేవలం రూ.20 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈపాలసీతో రూ.2లక్షల ప్రమాదబీమా పొందవచ్చున్నారు కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె : మండలంలోని గ్రామీణ ప్రజలకు స్థానిక వైద్య విధానపరిషత్ ఆసుపత్రిలో సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య కోరారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలో వేదపండితులు కృష్ణమూర్తి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

పెద్దతిప్పసముద్రం : మండలంలో చేపడుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈ విజయమోహన్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయనతో పాటు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి మండలంలోని మడుమూరు, రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి, పట్టెంవాండ్లపల్లి గ్రామాల్లో చేపడుతున్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ పనులను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి

నిమ్మనపల్లె : మూఢనమ్మకాలను నిర్మూలనకు కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి గుమ్మడి గంగులప్ప తెలిపారు. శుక్రవారం విజయవాడ ఉండవల్లి రాజగృహలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ సమావేశంలో గంగులప్పను రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర కోశాధికారిగా నిమ్మనపల్లె మండలం చౌకిళ్లవారిపల్లె గుమ్మడి గంగులప్పను డాక్టర్ భైరి నరేష్ నియమించారు.

ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మదనపల్లె : ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం–164 పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 4,5 తేదీల్లో ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి ఎం.ఎస్.మురళి తెలిపారు. శుక్రవారం సబ్ కలెక్టరేట్ కార్యాలయం విడుదల చేసిన పత్రికాప్రకటనలో... ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ముసాయిదా ఓటరుజాబితాతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటారన్నారు. ముసాయిదా ఓటరుజాబితాలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



జగనన్న ఆరోగ్యసురక్షలో మెడికల్ కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 13, 28వ వార్డు సచివాలయాల పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ ఉర్దూ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షల నిమిత్తం ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలను శిబిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే కాంక్షతో ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగన్ దేశానికి రోల్‌మోడల్ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలికవసతుల కల్పనతో పాటుగా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిపారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104 తదితర పథకాలతో పేదవాడి ఆరోగ్యానికి మహానేత వైఎస్సార్ భరోసా కల్పిస్తే... ఆయన తనయుడిగా జగనన్న ఆరోగ్యశ్రీ సేవలను మరింత మెరుగుపరిచి, పక్క రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారుగా రూ.30 కోట్లకు పైగా సీఎం సహాయనిధి అందించి ఎందరికో ఆర్థికంగా అండగా నిలిచామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నకు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, వెలుగుచంద్ర, కౌన్సిలర్లు వసీం, ఫర్జానారఫీ, షబానా, పాల్‌చంద్రశేఖర్, మేస్త్రీశ్రీనివాసులు, ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, షరీఫ్, ఎల్‌బీసీ.సుధాకర్, రాయల్ రవీంద్ర, వాజీద్, వినుతాభాయి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్.లక్ష్మీ, ఏఈ బండపల్లిశిరీషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తూ, సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తవారిపల్లె–2 దుబ్బిగానిపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ముద్రించిన బుక్‌లెట్స్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలుచేసిన సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రంలో పేదరికం స్థాయి 11 నుంచి 6 శాతానికి తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, వెలుగుచంద్ర, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, ఎంపీటీసీ ప్రియాంక, సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



మొబైల్‌వాహనం వద్ద కాలేజీ అధ్యాపకులు, విద్యార్థినులు

మదనపల్లె సిటీ : రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, హెచ్‌డీఎఫ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం అందక చాలా మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో రక్తం అందుబాటులో ఉంటే ప్రాణాలు కాపాడవచ్చుననన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి డాక్టర్ అమరావతి, అధ్యాపకులు గురుమూర్తి, డాక్టర్ జ్యోతి, మోహన్‌వల్లి, మోహన్‌బాబు, నమ్రత, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఈజీపీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు గుణశేఖర్ పిళ్లై

పీలేరు : రైతులు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు గుణశేఖర్ పిళ్లై అన్నారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పీఎంఈజీపీ పథకంపై పశువైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి ఆవులు కొనుగోలు చేసేందుకు పీఎంఈజీపీ ద్వారా 35 శాతం సబ్సిడీతో నాలుగు ఆవులు కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. యూనిట్ ధర రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఉంటుందని చెప్పారు. 10 శాతం లబ్ధిదారుడు భరించాలని, 55 శాతం బ్యాంకు రుణం ఇస్తుందని, 35 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. పాడి ఆవులు కల్గిన రైతులకు మేత కొనుగోలు, గడ్డి పెంపకంకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా విరివిగా రుణాలు అందించనున్నట్లు చెప్పారు. పీలేరు, వాల్మీకిపురం, కేవీపల్లె, కలకడ మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, ఈ మండలాల్లో పీఎంఈజీపీ పథకంను పెద్ద ఎత్తున చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ డీడీ మాలకొండయ్య, జిల్లా వ్యవసా సలహామండలి సభ్యుడు బోడేషావలి, ఏడీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాధనా సామర్థ్య సర్వే పరీక్ష



పీలేరు : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి

పీలేరు రూరల్ : కేంద్ర విద్యాశాఖ పిలుపు మేరకు మండలంలో మొత్తం 27 పాఠశాలల్లో విద్యార్థులకు సాధనా సామర్థ్య సర్వే పరీక్ష న్విహించినట్లు ఎంఈవోలు వై. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతమ్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక చేసిన 12 ప్రభుత్వ పాఠశాలలు, 12 ప్రైవేట్ పాఠశాలలు, 3 గురుకుల పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్య సాధనాలను తెలుసుకోవడానికి ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నటరాజన్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎడ్యుకేషన్ అసెస్మెంట్ సర్వే

కేవీపల్లె : మండలంలో ఎడ్యుకేషన్ అసెస్మెంట్ సర్వే పరీక్ష పగడ్బందీగా నిర్వహించినట్లు ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలో ఎంపిక కాబడిన 24 పాఠశాలల్లో ఎడ్యుకేషన్ అసెస్మెంట్ సర్వే పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాల అంచనా కోసం 3, 6, 9వ తరగతులకు ఈ సర్వే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 565 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెలో..

మదనపల్లె సిటీ : స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 52 ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఈ పరీక్షలలో 3,6,9 తరగతులకు చెందిన 2,132 మంది విద్యార్థులు హాజరయ్యారు. 94 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పరీక్షలను పర్యవేక్షించారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌తో పాటు నలుగు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పరీక్షలను పర్యవేక్షించారు.

జిల్లా రోప్‌స్కిప్పింగ్ జట్లు ఎంపిక



మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్–14,–17 బాల, బాలికల జిల్లా రోప్‌స్కిప్పింగ్ జట్లుకు ఎంపిక నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి పోటీలకు 24 మందిని ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల రెండో వారంలో తూర్పు గోదావరి జిల్లా భీమరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర పీడీల సంఘ అధ్యక్షులు ఏపీ రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, నరేష్‌బాబు, దేవకి, సుధాకర్,సంగీత, లత, భారతి, జ్యోతిలు పాల్గొన్నారు.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

మదనపల్లె సిటీ : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక చిత్తూరు బస్టాండులో ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర మదనపల్లెకు చేరుకుంది. అన్నమయ్య సర్కిల్ నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొట్టి మైనార్టీలు, దళితుల పట్ల దాడులు చేస్తున్నారన్నారు. కార్పొరేటర్లకు కొమ్ముకాస్తూ లక్షలాది కోట్లు రాయితీ ప్రకటిస్తున్న కేంద్రం ఇటు కార్మికులకు అటు కర్షకులకు చేసింది ఏమీ లేదన్నారు. కరువు విలయతాండవం చేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర నాయకులు ఉమా మహేశ్వరరావు మాటాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేశారన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం పేదలకు, కార్మిక,కర్షకులకు చేసిందేమి లేదన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేసేందుకు బస్సు యాత్ర చేపట్టామన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయంగా కలిసొచ్చే బావసారూప్య పార్టీలను కలుపుకుని ఒక వేదికగా ఏర్పాటు చేయడానికి విజయవాడలో ఈనెల 15న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, కృష్ణయ్య, రమాదేవి, శివనాగమణి, జిల్లా నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత

– ఏపీ టూరిజం జిల్లా అధికారి నాగభూషణం



ఏపీ టూరిజం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు : పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీ టూరిజం జిల్లా అధికారి నాగభూషణం అన్నారు. శుక్రవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో ఏపీ టూరిజం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో ఏపీ టూరిజంకు కేటాయించిన స్థలంలో అతిథి భవనం, హోటల్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు. అలాగే తంబళ్లపల్లె నియోజవర్గంలోని మల్లయ్యకొండ అభివృద్ధికి, రాయచోటిలో శిల్పారామం ఏర్పాటుకు, అలాగే హర్సిలీహిల్స్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం జిల్లా కౌన్సిల్ మెంబర్ షాకీర్, వీఆర్వో యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ మేలును తెలపండి

- వైఎస్సార్ సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయండి
- పేదవాడికి మేలు జరగాలంటే జగనన్న మళ్లీ రావాలి
- వలంటీర్లు, గృహసారథులతో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత,పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లదేనని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని జేఎంసీ కమ్యూనిటీ హాల్‌లో మున్సిపాలిటీలోని 35వార్డులకు సంబంధించి వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ జింకాచలపతి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ....రాష్ట్రంలోని ప్రతి ఇంటిలోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచి కనిపిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటించినప్పుడు సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం, సాదరంగా స్వాగతం పలకడం, జగనన్నను నిండుమనస్సుతో ఆశీర్వదించడం ఎంతో గొప్పగా అనిపించిందన్నారు. ప్రజలకు మంచి చేసినవారిని ఎప్పటికీ మరచిపోరని, అది గడప గడపకు మన ప్రభుత్వంలో స్పష్టంగా కనిపించిందన్నారు. ఒక మదనపల్లె పట్టణంలోనే వైఎస్సార్ సీపీ పాలనలో వివిధ పథకాల కింద ప్రజల ఖాతాల్లో 500 కోట్లు జమచేశామని, దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.2 నుంచి 10 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకునేందుకు సెంటు స్థలం ఇస్తే.. మదనపల్లెలో 1.5 సెంటు స్థలం ఇప్పించామన్నారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మంజూరైన మెడికల్ కళాశాలను మదనపల్లెకు కేటాయించేలా ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని ఒప్పించామన్నారు. ఈ వాస్తవాలన్నింటినీ ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం, జగనన్న మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలనే దానిపై ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు దుర్బుద్ధిని, మోసపూరిత మనస్తత్వాన్ని ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు మునిశేఖర్, బావాజీ, వైస్ చైర్మన్ నూర్‌ఆజం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, శీలంరమేష్, దండురామాంజులు, షరీఫ్, రాయల్‌రవీంద్ర, ఆంజనేయులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడం జరుగుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని అద్దవారిపల్లి సచివాలయం పరిధిలోని గుంటివీరన్నపల్లి, గల్లావారిపల్లి, కురవపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్ళలో ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందచేసి, సంక్షేమ పథకాల అమలు తీరుపై విచారించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ప్రజలను విచారించారు. సకాలంలో ఫించను అందుతోందా.. ప్రభుత్వ పథకాలను వలంటీర్లు వివరిస్తున్నా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోయినా, ఇతర సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సిమెంటు రోడ్డు, విద్యుత్ స్తంబాలు, వీధిలైట్లు, తాగునీటి కుళాయిలు, రేషన్ కార్డుల విభజన, వృద్ధాప్య ఫించను తదితరాలపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై ఆయా శాఖల అధికారులను విచారించిన ఎమ్మెల్యే త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, సర్పంచ్‌లు గంగయ్య, వెంకటరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సావిత్రిప్రదీప్‌రెడ్డి, ఎంపీడీఓ గంగయ్య, ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

సీఐ మహబూబ్‌బాషా



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

మదనపల్లె : బహిరంగంగా మద్యం సేవించడం, తాగి రోడ్లపై వాహనాలు నడపడం చేసిన వారిపై కఠినచర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం బహిరంగంగా మద్యం సేవించిన, తాగి వాహనాలు నడిపిన వారికి స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మద్యం ప్రియులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని సూచించారు. విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నందున పట్టణంలోని ప్రజలతో పాటు మహిళలు, విద్యార్థులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. వీరివల్ల అభద్రతాభావం వ్యక్తమవడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అకవాశాలు ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గస్తీ ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగినా, అసభ్యంగా ప్రవర్తించినా 100 నంబర్‌కు డయల్ చేయాలని, లేక 9440796739 వాట్సప్ నంబర్‌కు ఫోటోలు, వీడియో, సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.